# పుణ్య దంపతులు
# శ్రీ పలివెల లక్ష్మీనారాయణ - సుబ్బలక్ష్మిగార్లు

1800 సంవత్సరాలలో కరువు వచ్చింది. అప్పుడు కొన్ని బ్రాహ్మణ కుటుంబాలు గోదావరి జిల్లాలనుండి గోదావరి ఒడ్డే నడుచుకుంటూ కొండలు, గుట్టలు దాటి కొద్దిగా మైదానప్రాంతమైన రుద్రంకోట, గౌరిదేవిపేట, కుక్కునూరు, వడ్డిగూడెం, ప్రాంతాలకి వలసవచ్చి నివసించే వారు. ఇలాగే వరంగల్లు, నల్లగొండ జిల్లా మునుగోడు ప్రాంతం నుండి కూడా కొన్ని బ్రాహ్మణ కుటుంబాలు వలస వచ్చినారు. ఇలా వచ్చిన కుటుంబాలు వారు పలివెల, కొఠారు, బండారు, కోదాటి వారు. వీరేకాక మరికొన్ని పలివెల వారి కుటుంబాలు మైదానప్రాంతమైన మధిర, కలకోట, కొత్తగూడెం దగ్గర సిరిపురం, వచ్చి నివసించే వారు.

అలా వచ్చిన వారు శింగయ్యగారి తాతగారు. శింగయ్యగారి తాత గారికి ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు కొడుకు శింగయ్య. చిన్న కుమారుడికి ముగ్గురు కుమారులు. అందువల్ల ఆస్తిలో సగం వాటా శింగయ్యకి, మిగిలిన సంగంలో ముగ్గురు పంచుకున్నారు.

అలా స్థిర పడ్డాక కాలక్రమేణ వీరిలో వీరు (వరసైన) వేరే ఇంటి పేరు కల నియోగి బ్రాహ్మణ కుటుంబాలవారితో పెళ్ళిళ్ళు, బంధుత్వాలు కలుపుకొని చుట్టరికాలు పెంచుకున్నారు. కొన్ని పలివెల వారి కుటింబీకులకు పిల్లలు లేకపోతే వారిపిల్లల్ని దత్తు

ఇచ్చేవారు. అలా దత్తువచ్చినవారు కాచవరం శేషగిరిరావు గారి పూర్వీకులు. గౌరిదేవిపేటవారి పూర్వీకులు. పలివెల వారు కుటుంబాల పెరుగుదలకి, కొన్నిసార్లు సత్తుపల్లి, జంగారెడ్డిగూడెం ప్రాంతం వారితో పెళ్ళిళ్ళు చేసుకునేవారు. రుద్రంకోటలో పలివెల సింగయ్య, మంగమ్మలకు ఇద్దరు ఆడపిల్లలు. నైజాం ప్రభుత్వంలో ఆడపిల్లకు ఆస్తి హక్కు వారసత్వం హక్కు లేనందున, ఆస్తులు, కాపాడుకోవడం కోసం మగసంతానం కోసం కొత్తగూడెం దగ్గర సిరిపురం నుండి, పలివెల రంగారావు గారిని దత్తు తెచ్చుకున్నారు. దాయాదుల కుట్రల వల్ల వచ్చిన కొద్ది కాలానికే రంగారావుగారు మరణించారు. శింగయ్యగారికి వడ్డిగూడెం కరణీకం ఉన్నందున మిత్రుడు అన్నంరాజు వెంకట రత్నం గారు చెప్పగా వారి అన్నగారు హనుమంతరావు గారి కుమారుడు పదకొండుఏళ్ళ లక్ష్మినారాయణను దత్తు తెచ్చుకుని, మనుమరాలు సుబ్బ లక్ష్మిని ఇచ్చి వివాహం చేశారు మంగమ్మ – శింగయ్య దంపతులు.

పలివెల వారి కటుంబాలకి నాగదేవత శాపం వల్ల మూడు తరాల సంతానం నిలవదని ప్రచారం (వెనకటికి ఎప్పుడో పలివెలవారి కోడలు వేడి పాలకుండను తాటాకు కుదురు (చుట్టు), అనుకుని చుట్టచుట్టుకుని పడుకున్న నాగుపాము మీద పెట్టగా ఆ నాగుపాము చనిపోయినందున). సింగయ్య తండ్రికి ఒక్క కొడుకు సింగయ్య మిగిలాడు. సింగయ్యకు మొదటి దత్తు కుమారుడు రంగారావు, మూడవ కుమారుడు నరసింగరావు చనిపోయారు.

రెండవ(దత్తుడు) కుమారుడు లక్ష్మీ నారాయణకి పుట్టిన మొదటి ఇద్దరు సంతానం మరణించడంతో భయపడిన పలివెల వారి కోడళ్ళు ప్రతిరోజు జంట నాగులకు పూజలు చేస్తారు మరియు నాగుల చవితికి పుట్టలో పాలు  పోసి వారి సంతానాన్ని కాపాడమని నాగ దేవతను కోరుకుంటున్నారు.

సాధారణ వ్యవసాయ కుటుంబీకులు సత్తుపల్లి తాలూకా తుమ్మూరు గ్రామంలో మాదిరాజు వారి ఆడపడుచు మంగమ్మ వివాహం రుద్రంకోట పలివెల సింగయ్యతో సుమారు 1890లో వివాహం జరిగింది. సాధారణ మహిళగా పలివెల వారి కోడలుగా వచ్చి, తన తెలివితేటలతో ధైర్య సాహసాలతో దయాగుణంతో మంగమ్మగారు  మహా మహిళగా పేరు తెచ్చుకున్నది.  మామూలు మహిళగా సంసారం సాగిస్తు వారసత్వంగా వచ్చిన ఆస్తులు కాపాడ టానికి మరియు 16 గ్రామాల కరిణీకం నిలుపుదలకు భర్తతో చర్చ జరిపి ఒప్పించి, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నా, 11 సంవత్సరాల లక్ష్మీనారాయణను దత్తుచేసుకుంది. దాయాదుల గొడవ వల్ల (దత్తు చెల్లదంటారేమో అనుమానంతో, అనుభవంతో) మగ సంతానం కోసం సింగయ్యకు గోదావరి జిల్లా మోతుకూరులోని కామేశ్వరమ్మతో రెండవ వివాహం జరిపించింది.  లక్ష్మీ నారాయణకు తన మనమరాలు సుబ్బమ్మతో వివాహం జరిపించింది. తరవాత లక్ష్మీ నారాయణని భద్రాచలంలో చదివించు చుండగా సింగయ్య మరణించారు. లక్ష్మీనారాయణను చదువు ఆపించి రుద్రంకోటలో

ఉంచుకుని ఆస్తి వ్యవహారాల విషయం అవగాహన కల్పించింది. లక్ష్మీ నారాయణ కరిణీకంలో మెళకువలు బూర్గంపాడు శ్రీ పట్టసాని సత్యనారాయణరావుగారి వద్ద నేర్చుకున్నారు. దాయాదుల నుండి ఎదురైన ఆస్తుల కేసులలో మంగమ్మ గారు దత్తుడిని వరంగల్లు జిల్లా కోర్టుకు తనతో పాటు తిప్పుకుంటూ చక్కటి అవగాహన కల్పించి వ్యవహారాలు విజయవంతంగా ముగించింది.

మంగమ్మ గారు ధైర్యంగా, పగలు, రాత్రులు జీతగాళ్ళను, తలారులను, వెంటతీసుకుని పొలాల వెంట తిరుగుతూ వ్యవసాయం చేయిస్తూ లక్ష్మీ నారాయణకు పొలాలు చూపుతూ అవగాహన కలిపించి ధైర్యం నేర్పుతూ దాయాదుల గుండెల్లో రైళ్ళు పరుగెత్తించింది. 1947 మరియు 1948 ప్రాంతాలలో నైజాంలో రజాకార్ల హడావుడి బాగా వుండేది. మంగమ్మ గారు రుద్రంకోట నుండి ఆంధ్రాప్రాంతం వడ్డిగూడెంకి తన కుటుంబంతో వలస వెళ్లారు. ముందు జాగ్రత్త కోసం తన సవితి కామేశ్వరమ్మను చిన్నవాడైన నరసింగరావును పుట్టింటికి పంపింది. తను, కొడుకు లక్ష్మీ నారాయణ, కోడలు సుబ్బలక్ష్మిలతో వడ్డిగూడెంలో నివాసం ఉంటూ రుద్రంకోట, దూరప్రాంతమైన నార్లవరం మరియు వసంతవాడలలో వ్యవసాయం చేయించడం కోసం తాను ఒక్కతే జీతగాళ్లను వెంట తీసుకుని, గోదావరి నదిలో నావలో(వడ్డిగూడెం నుండి నార్లవరం)వెళ్లి వ్యవసాయం చేయించేది. మంగమ్మగారి ధైర్య సాహసాలకు భయపడి రుద్రమకోట ఇంటిని దాయదులు

నిప్పు పెట్టి తగలబెట్టినారు. రజాకార్ల హడావిడి తరువాత మంగమ్మ గారు రుద్రంకోట తిరిగి వచ్చి గడ్డి ఇల్లు కట్టించినారు. మంగమ్మగారి పుట్టింటికి (తుమ్మూరు)వెళ్ళినప్పుడల్లా మంది మార్బలంతో మేనాలో వెళ్లి కొన్ని రోజులు ఉండి తిరిగి వస్తూ రుద్రమకోట ఊరి దగ్గరికి రాగానే గన్‌మాన్‌లను తుపాకీ పేల్చమని ఆదేశించేవారు, ఆ శబ్దాలకు ఊరి జనం గోదావరి వడ్డు దిగి వర్రెలలో దాక్కునే వారు. కాసేపు ఆగి మంగమ్మగారు మనుషులను పంపి వచ్చింది తానే నని, మీకు భయము లేదని ఊర్లోకి రమ్మని కబురు చేసేవారు. ఇదంతా ప్రమాదం వచ్చినప్పుడు మీరు జాగ్రత్తగా ఉండటం కోసం మీకు తెలియజేయటానికి ఇలా చేశాను అని ఊరు జనానికి చెప్పేది. ఇలా ఒకసారి ఊరి జనాలను ఆటపట్టించింది మంగమ్మ గారు. ఇది మంగమ్మగారి హాస్యానికి నిదర్శనం.

పలివెల లక్ష్మీనారాయణ(మా నాన్నగారు) 16 గ్రామాల కరణీకం చేసుకుంటూనే, ఆస్తుల వ్యవహారాలు పరిష్కరించుకునే వారు. వ్యవహారాల పరిష్కారానికి హైదరాబాదులోని ప్రముఖ న్యాయవాది బూర్గులరామకృష్ణారావు (హైదరాబాదు రాష్ట్రానికి మొదటి ముఖ్యమంత్రి) గారి వద్ద సహాయకుడిగా పనిచేస్తున్న తన అన్నగారు అన్నంరాజు సీతాపతి సహాయం మరియు బూర్గుల రామ కృష్ణారావుగారి న్యాయపరమైన సలహాలు తీసుకొని ఆస్తి వ్యవహారాలు మరియు దాయాదుల నుండి ఎదురైన సమస్యలను న్యాయపరంగా పరిష్కరించుకున్నారు. ఊళ్ళో వ్యవహారాలు చూసు

కోవటం లోను, వ్యవసాయంలోను లక్ష్మీ నారాయణ గారికి మిత్రుడు రావి రామయ్య గారు చక్కటి సలహా ఇచ్చేవారు ఎప్పుడూ లక్ష్మీ నారాయణ గారికి తోడుగా ఉండేవారు.

అనేక గ్రామాల కరణీకం  ఉండటం వల్ల, తన దూరపు బంధువు ఊటుకూరి  తులసిదాసుని, తనకరిణీకంలో సహాయకునిగా ఉండటం కోసం, తీసుకుని వచ్చి తన వద్ద ఉంచుకున్నారు. తులసీదాసు కూడా తన పనితనంతో లక్ష్మీ నారాయణకి అండగా ఉన్నారు,  దాంతో లక్ష్మీనారాయణ గారికి తాలూకాలో మంచి కరణంగా పేరు, ప్రఖ్యాతులు వచ్చాయి. రాజకీయాల మీద లక్ష్మీనారాయణ గారికి మంచి అవగాహన ఉండేది. శ్రీ శీలం శిద్దారెడ్డిగారితో మంచి అనుబంధం ఉండేది. అలాగే యం.ల్.సి. తోటకూరి వెంకటప్పయ్యగారితో మంచి స్నేహం, చనువు ఉండేది. అప్పటి ముఖ్య మంత్రి జలగం వెంగళరావుగారితో సత్‌సంబంధాలు, స్నేహభావం  ఉండేది.

తన అన్నగారి(సీతాపతి)  కుమార్తె  సుందరిని తులసిదాసు గారి తమ్ముడు చక్రధరరావుతో వివాహం జరిపించారు. తన బంధువైన శేషగిరిరావు సహాయంతో హైదరాబాదులో చక్రధరరావుకి ప్రభుత్వ ఉద్యోగం ఇప్పించి, తన అన్నగారి కుటుంబానికి తనవంతు సహాయం చేశారు.

స్వతహాగా చురుకైన లక్ష్మీనారాయణ గారు, పెద్దల

సాన్నిహిత్యంలో కరణీకంలోని మరిన్ని మెళకువలు నేర్చుకొని గౌరవప్రదంగా మరియు హుందాగా కరణీకం చేశారు.

మంగమ్మ గారి ఆధ్వర్యంలో వ్యవసాయంలో తొలి అడుగులు వేసిన కొద్ది కాలంలోనే వ్యవసాయంపై పట్టు సాధించిన లక్ష్మీ నారాయణ గారు గుంటూరు ప్రాంతం నుండి మెట్ట వ్యవసాయంలో అనుభవం ఉన్న రాఘవయ్యను తీసుకొని వచ్చి కొత్త పద్ధతులలో వ్యవసాయం చేయించారు. వ్యవసాయం చేయగా మిగిలిన భూములను పొన్నూరు ప్రాంతం నుండి వల్లభనేని కృష్ణయ్య మరియు చెన్నుపాటి సుబ్బారావును తీసుకొని వచ్చి నార్లవరం వద్ద ఉన్న భూములను వ్యవసాయానికి ఇచ్చారు. చీరాల, కారంచేడు, పర్చూరు మరియు తెనాలి నుంచి అబ్బ రామనాథం బార్లపూడి వెంకటసుబ్బయ్య, మాధవ పెద్ది రోశయ్య, పోతిన పాపయ్య మరియు కోట వెంకటేశ్వర్లు గార్లకి వేలేరుపాడు/రుద్రంకోట భూములు ఇచ్చి వర్జీనియా పొగాకు వ్యవసాయం చేయించారు. తను గూడ 16 బెరన్లతో 100 ఎకరాల్లో బేరను వ్యవసాయం చేస్తూ, బొబ్బరి లంక, కొవ్వూరు ప్రాంతవాసులైన వీర్రాజు, సత్తిరాజులను తీసుకొని వచ్చి గోదావరి లంకల్లో లంక పొగాకు కూడా పండించారు.

తాను కూడా 100 ఎకరాలు వర్జీనియా పొగాకు వ్యవసాయం మరియు వాణిజ్య పంటలైన మిర్చి, పత్తి మరియు పసుపు పంటలు కూడా పండించి ఆర్థికంగా స్థిరపడినారు.

1955లో చీరాల ప్రాంతం నుంచి నైపుణ్యం కలిగిన పని

వారిని తీసుకువచ్చి రుద్రంకోటలో విశాలమైన భవనం కట్టించుకుని నివాసం ఉన్నారు. లక్ష్మీనారాయణ గారు ఆర్థికంగా స్థిరపడిన తరువాత నండూరులో తనను కన్న తల్లిదండ్రుల సుఖ జీవనం కోసం కొంత వరి పొలం కొని ఇచ్చినారు. తన తోడబుట్టిన వారందరికీ వారి అవసరాలు గమనించి సహాయాలు చేశారు.

లక్ష్మీనారాయణ గారు చుట్టుపక్కల గ్రామాల రైతులకు సాయం చేస్తూ వారి అభివృద్ధికి సహాయపడినారు. లక్ష్మీనారాయణ గారి మీద ఉన్న అభిమానంతో అందరూ లక్ష్మీనారాయణ గారిని "పెద్ద కరణం" గారు అని పిలిచేవారు. అల్లూరి సీతారామరాజు చరిత్ర, డొక్కా సీతమ్మగారి చరిత్ర, పుస్తకాలను అంకితం తీసుకొని, కవులను ఆదరించేవారు. అశ్వారావుపేట పంచాంగ కర్త శ్రీ కావూరి వెంకటప్పయ్య శాస్త్రి గారికి పంచాంగాల ముద్రణకు ఆర్థిక సాయం చేస్తుండేవారు. లక్ష్మీ నారాయణగారు తన తమ్ముడు నరసింగరావుకు పండూరు (కాకినాడ దగ్గర) అవసరాల వారి అమ్మాయి రత్నావతితో వివాహం జరిపించారు. నరసింగరావు కుమారుడు భూషణరావు పెద్ద వాడైనా తరువాత తన మనవరాలు రమాదేవితో వివాహం జరిపించారు.

లక్ష్మీనారాయణ గారు తన చదువు చిన్నతనంలోనే ఆగిపోయిందని, చాలామందికి చదువుకొనుటకు తనవంతు సహాయం చేసేవారు. అలా సహాయం పొందిన వారిలో అనేకమంది మనదేశంలోనూ మరియు కొందరు విదేశాల్లోనూ స్థిరపడ్డారు.

చిన్నతనము నుంచే ఎక్కువ బాధ్యతలు/వ్యవహారాలు తానొక్కడే చూసుకొనుట వల్ల ఎల్లప్పుడూ ముభావంగా, కోపంగా మరియు గంభీరంగా కనపడేవారు, కానీ స్వతహాగా లక్ష్మీనారాయణ గారు శాంతి స్వభావులు.

మంగమ్మగారి రెండవ కుమార్తె రమణమ్మకి మరియు కొరారు సుబ్బారావుగారి ఏకైక కుమార్తె సుబ్బలక్ష్మి(మా అమ్మగారు). దురదృష్టవశాత్తు చిన్నతనంలోనే తల్లితండ్రులను కోల్పోయినందున తన బాల్యమంతా అమ్మమ్మ తాతయ్యలైన సింగయ్య గారు, మరియు మంగమ్మ గారి దగ్గరే గడిపినారు. అమ్మమ్మ తాతయ్యల దగ్గర చాలా గారాబంగా పెరిగిన సుబ్బలక్ష్మి తన చిన్నతనంలో గుర్రపు స్వారీ నేర్చుకున్నారు. సుబ్బలక్ష్మి గారికి లక్ష్మీనారాయణ గారితో 1933(సుమారుగా) బాల్యవివాహం జరిగింది.

సుబ్బలక్ష్మి గారు భర్త ఆలోచనలకు అనుగుణంగా తన సహాయ సహకారాలు అందించేవారు. ఎల్లప్పుడు పేదసాదలను ఆదరిస్తూ ,ఏవేళలోఅతిధులు వచ్చినావారికి లేదు అనకుండా అన్నంపెట్టి ఆదరించేవారు. పలివెల వారి కుటుంబం అభివృద్ధికి ఐక్యతకి భర్తకి తోడుగా ఉంటూ ఎన్నో గుప్త దానాలు చేసేవారు సుబ్బలక్ష్మిగారు. పలివెల లక్ష్మీనారాయణ గారు తమ పిల్లల అభిరుచులకు అనుగుణంగా ఉంటూ, తమ నలుగురు కొడుకులు ఐదుగురు కుమార్తెలు కోరిన చదువులు కొరకు వెనకాడకుండా భద్రాచలం పట్టణంలో చదివించారు. కూతురు రూపను ఏలూరులో

చదివించారు మగపిల్లలు వారు కోరుకున్న విధంగా మద్రాసు, రాయచూరు, హైదరాబాదులలో చదివించారు. పిల్లల వివాహాలు వారు కోరిన విధముగా జరిపించినారు. ఈ విధముగా నారాయణ సుబ్బలక్ష్మి దంపతులు పలివెల కుటుంబం అభివృద్ధికి ఐక్యతని కాపాడి తమ సంతానం అందరూ వారి కుటుంబాల అభివృద్ధికి ఐక్యతకి పాటుపడాలని కోరుకునేవారు. తమ పిల్లల చిన్నతనంలో ప్రతి వేసవికాలం రాజమండ్రి, గుంటూరు, తిరుపతి తీసుకొని వెళ్లి సరదాగా పది నుంచి 15 రోజులు గడుపుతూ అలాగే పుణ్యక్షేత్రాలకు తీసుకొని వెళ్లి బాల్యంలోనే దైవభక్తి అలవాటు చేశారు. పిల్లలకి ఏ విషయమైనా లోతుగా ఆలోచించడం, సమాజానికి ఉపయోగ పడే విధంగా ఆలోచన చేయమనేవారు. పదిమందికి మంచి చేయమని, ఎవరికి హానిచేయవద్దని హితవు చెప్పేవారు.

తాము ఉన్నంతకాలం ప్రతి దసరా, దీపావళి మరియు వేసవి సెలవులకు పిల్లలు, మనవళ్లు, మనవరాళ్లు మరియు చుట్టాలను ఆహ్వానించి రుద్రమకోటలో ఘనంగా పండుగలు జరిపించేవారు. ప్రతి పండగకు కనీసం 60 నుంచి 70 మంది పిల్లలతో పెళ్లి ఇల్లువలె కళకళలాడుతూ ఉండేది. మనవళ్ళు మరియు మనవరాలు ఇప్పటికీ ప్రతి పండగకి అప్పటి రోజులు తలుచుకుంటూ ఆనందిస్తారు.

లక్ష్మి నారాయణ గారి పెద్ద అబ్బాయి సుబ్బారావు బ్యాంక్ అధికారిగా

రెండవ అబ్బాయి రాజారావు ఆటో మొబైల్ ఇజనీరింగ్ చదివి వ్యవసాయంలో స్థిరపడినాడు. మూడో అబ్బాయి సాయిబాబు ఇంజెనీరుగా జువారి సిమెంట్స్‌లో జనరల్ మేనేజర్‌గా, నాలుగో అబ్బాయి రాంబాబు మెడికల్ డిపార్ట్మెంట్‌లో స్థిరపడ్డారు. లక్ష్మీ నారాయణ గారి మనుమలు కొందరు ఉన్నత చదువులు చదివి విదేశాల్లో ఉన్నతమైన ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. ఇంకొందరు విదేశాలలో ఉన్నత చదువులు చదువుతున్నారు. లక్ష్మి నారాయణ గారికి ఐదుగురు ఆడపిల్లలు. విశాలాక్షి, సుందరి, సావిత్రి, రూపవతి, లక్ష్మీ. నలుగురు ఆడపిల్లలో ఖమ్మంలో ముగ్గురు స్థిరపడినారు. ఒకరు గుంటూరులో స్థిరపడినారు. ఆడపిల్లల్లో ఒకరు న్యూజిలాండ్‌లో స్థిరపడ్డారు. న్యూజిలాండ్‌లో ఉన్న అమ్మాయి కూతుళ్లు విదేశాలలో స్థిరపడినారు. ఇండియాలో ఉన్న లక్ష్మీ నారాయణగారి కూతుళ్ళ పిల్లలు ఉన్నత చదువులు చదివి ఉన్నత స్థితిలో ఉన్నారు, కొందరు విదేశాల్లో చదివి ఉద్యోగాల్లో ఉన్నారు. అలాగే లక్ష్మినారాయణగారు తమ్ముడి కుమారుడు చిన్నరాజు పిల్లలు ఇద్దరు పెద్ద చదువులు చదివి విదేశాల్లో ఉన్నతస్థితిలో ఉన్నారు.

ఎన్నో మధురజ్ఞాపకాలను మరియు స్మృతులను మాకు మిగిల్చిన పుణ్య దంపతులు శ్రీలక్ష్మి నారాయణ గారు శ్రీమతి సుబ్బమ్మ గారు ఇద్దరూ పుణ్యలోకాలకి చేరారు. అదేమిటో గానీ వారు పోయిన కొంతకాలానికే పోలవరం ప్రాజెక్టు నిర్మాణం మొదలు పెట్టటం వల్ల మా రుద్రంకోట గోదావరిలో మునిగి

పోతుంది.

మా ఊరు ఘన చరిత్ర కలిగినది. కాకతీయుల రాజ్యాంలో రుద్రంకోట గ్రామం ప్రసిద్ధి చెందింది. కాకతీయులు శివాలయం నిర్మాణం చేశారు. మా ఊరి గుట్టమీద ఇప్పటికీ కొన్ని కాకతీయుల నిర్మాణాలు బయట పడ్డాయి. ఇంత చరిత్ర కలిగిన మా రుద్రంకోట గోదావరిలో మునిగిపోతుంది. మా ఊరి ప్రజలు అందరూ ఏ దిక్కుతోచక ఏమి చేయాలో తెలియక అయోమయంలో చెట్టుకు ఒకరు పుట్టకొకరు వలసలు వెళ్ళిపోతున్నారు.

# గ్రామదేవత మాలక్షమ్మ

మా రుద్రంకోట గ్రామానికి మాలక్షమ్మ ముఖ్యమైన గ్రామ దేవత. ఊరి నడిబొడ్డున మాలక్షమ్మ గుడి ఉంది. మాలక్షమ్మ శాంతి దేవత, మాఊరిలొ కొందరికి మాలక్షమ్మ పూనుతుంది. మా అక్కయ్యకి కూడా పూనుతుంది. అమ్మవారు వంటిమీదకి వచ్చేముందు మా అక్క మౌనంగా కూచుటుంది. పదినుండి పదిహేను నిమిషాలు అమ్మవారు మా ఇంటివారి వివరాలు తెలుసుకుంటుంది. మావాళ్ళుఎవరైనా రుద్రంకోట వచ్చి మాలక్షమ్మ గుడికి వెళ్ళకపోతే మాఅక్క వంటిమీదకి వచ్చి గుడికి రాలేదు నన్ను మరచిపోతున్నారా! అంటుంది. మా అన్నదమ్ములం, మా అక్కచెల్లెళ్ళు మావూరు వెళ్ళినప్పుడు మాలక్షమ్మ గుడికి తప్పకుండా వెళ్తాము. మా రుద్రంకోటలో ప్రతి యేడు సంబరాలు జరుగుతాయి. సంబరాలు జరిగేరోజు ఉదయం గుళ్ళో గరిగలు తీసుకుని గణాచారులు (దేవరపూనే వారు)డోళ్ళు, సన్నాయి, డబుకుల వాయిద్యాలతో తూరుపు రేవు నుండి గోదావరికి చేరుకుని గరిసెలను శుభ్రపరుచుకుని గోదావరిలో స్నానాలు చేసి అక్కడే గరిసెలకు పసుపు, కుంకుమలతో పూజలు చేయగానే గణాచారులపై గ్రామ దేవతలు మాలక్షమ్మ, ముత్యాలమ్మ, మద్దిరావమ్మ, కొర్రల పాటివెంకమ్మ, పెద్దమల్లయ్య, చిన్నమల్లయ్య, వనంపోతురాజు, దంటుమారెమ్మ, నల్లమారెమ్మ సమ్మక్క, పోతురాజు, సుకాలరాయుడు, వేపకొయ్య ముత్యాలమ్మ, నాగులమ్మ మొదలగు

గ్రామ దేవతలు పూనతారు. ప్రతి దేవత వేపాకు, పసుపు, నములుతూ పెద్ద కుంకుమ బొట్టు పెట్టకుని వీరతాళ్ళు మెడలో వేసుకొని పెద్దగా కేకలు వేసుకుంటూ ఊళ్ళోకి ప్రవేశించి ప్రతి ఇంటి ముందు ఆగుతారు. ఆ ఇంటి వారు బిందెలతో నీళ్ళు గరిసెల ముందు పోసి హారతులు ఇచ్చి నైవేద్యంగా పండ్లు, బెల్లం ఇచ్చి దేవర పూనిన వారికి బిందెలతో నీళ్ళు పోసి పంపుతారు. ఇలా ఊళ్ళో అందరి ఇళ్ళకి దేవరపూనిన గణాచారులు తిరుగుతారు. ఎవరికైనా గాలిసోకితే దేవర పూనిన దేవర వారికి బండారు పెట్టి మెడలో వీరతాడు వేసి భయం పోగొడతారు. ఎవరికైనా దెయ్యం పడితే ఇద్దరు లేక ముగ్గురు దేవర గణాచారులు దెయ్యంపట్టిన వారిని వీరతాళ్ళతో కొట్టి దెయ్యాన్ని వెళ్ళకొడతారు. శాంతంగా ఉండే గ్రామదేవతలు మామూలుగా దేవరపూని డోలు, సన్నాయి, డప్పుల వాయిద్యానికి ఎగురుతుంటారు. కొందరు ఉగ్ర గ్రామదేవతలు వాయిద్యాలకు అనుగుణంగా కేకలు వేసి వీరంగం వేసి ఎగురుతుంటారు. ఒక్కోసారి కోడిపిల్లల, పంది పిల్లల మెడలు కొరుకు తుంటారు ఉగ్రరూపులైన గ్రామ దేవతలు. మధ్యాన్నం కాగానే దేవరలు అన్ని మాలక్ష్మమ్మ గుడి వద్ద రావి చెట్టు కింద కొంతసేపు ఎగిరి ఒక్కొక్కరి ఒంటి మీద నుండి వెలిసి దేవర పూనిన అందరు ఇళ్ళకు వెళ్తారు.

సాయంత్రం చీకటి పడగానే గుడి ముందు గ్రామ ప్రజలు ఊరి పెద్దలు పిల్లా పాపలు అందరూ రాగానే, డోలు సన్నాయి

వాళ్ళు డపుకుల వాళ్ళు వచ్చాక దేవర పూనే వాళ్ళు రాగానే మేళాల దరువులకు దేవరలు పూని వీరంగం వేసుకుంటూ ఒకవైపు శాంత దేవరలు ఎగురుతుంటే, ఉగ్రదేవరలు డోలు సన్నాయి దగ్గర డపుకుల దగ్గర వీరంగం వేసి కేకలు వేసి తిరుగుతుంటారు. సంబరం రాత్రి పది పదకొండు గంటలదాకా సాగుతుంది. తరవాత ఒక్కొక్క దేవర వెలిసి అందరు ఇళ్ళకి వెళ్తారు. నాలుగు ఏళ్ళకి ఒకసారి మాఊళ్ళో బండి కొలుపులు మూడు రోజులు జరుగుతాయి. ఈ బండికొలుపుల్లో ముఖ్య(ఉగ్ర)గ్రామ దేవతలు నాలుగు చక్రాల చిన్నబండిపై నిలబడి గ్రామం నాలుగు వైపుల పొలిమేరల్లో బలులు ఇచ్చి తోరణాలు కడతారు. ఈ తోరణాలు కట్టటం వల్ల గ్రామంలోకి దయ్యాలు రావని నమ్మకం. బండికొలుపుల్లో జంతుబలి జరుగుతుంది. ఇది అనాదిగా వచ్చే ఆచారంగా గ్రామాల ప్రజలు భావించడం వల్ల ఇప్పటికి గ్రామాల్లో జంతుబలులు జరుగుతున్నాయి.

...